ప్రజాశక్తి
సోమవారం 27 మార్చి 2023
5
కర్నూలు



గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.69 కోట్లు

- సచివాలయాల నిర్మాణాలు వేగవంతం
- జగనన్న కాలనీలకు ముఖ ద్వారాల నిర్మాణం
- ప్రజాశక్తితో పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

"జిల్లాలో చాలా గ్రామాలకు రహదారులు సరిగా లేవు. చాలా ప్రమాదకరంగా ఉన్న గ్రామాల రహదారులు గుర్తించి రహదారులు వేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. సచివాలయాల నిర్మాణాలు వేగవంతం చేస్తున్నాం. మరింత అభివృద్ధిని చేయడానికి తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.69 కోట్ల మేర మంజూరయింది. తక్షణమే నిర్మాణాలు చేసేలా చర్యలు తీసుకుంటాం" అని పంచాయతీ రాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

ప్రస్తుతం రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వాటికి ఏం చర్యలు తీసుకున్నారు?

ఎస్ఇ : జిల్లాలో 6 మండలాల్లోని గ్రామాల్లో, మండల కేంద్రాల్లో రహదారులు పూర్తి అధ్వానంగా ఉన్న వాటిని గుర్తించాం. దాదాపు వాటి నిర్మాణాలు అన్నీ పూర్తయ్యే దశలో ఉన్నాయి. అదనంగా 11 రహదారులను గుర్తించాం వాటికి నిధు మంజూరుకు పంపించాం. రూ.69 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో వాటి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

సచివాలయాల నిర్మాణాలు ఎలాంటి దశలో ఉన్నాయి ? సమస్యలు ఏమైనా ఉన్నాయా?

ఎస్ఇ : కర్నూలు జిల్లా మొత్తం 458 సచివాలయాలు ఉన్నాయి. అందులో ఆదోని డివిజన్‌లో 276 మంజూరు అయ్యాయి. ఇందులో పూర్తి అయినవి 71, ఫినిషింగ్ దశలో 37, సెకెండ్ స్లాబ్ 31, మొదటి స్లాబ్ 38, రూఫ్ లెవల్ 39, బేసిమెంట్ లెవల్ 45 , బేసిమెంట్ ముందు 13 ఇంకా మొదలు కానివి 2 ఉన్నాయి. కర్నూలు డివిజన్‌లో 182 మంజూరు కాగా 65 పూర్తి అయ్యాయి. 55 ఫినిషింగ్ దశలో, సెకెండ్ స్లాబ్ లో 20, మొదటి స్లాబ్‌లో 9, రూఫ్ లెవల్‌లో 21, బేస్మెంట్ 10, బేస్మెంట్ కంటే తక్కువ దశలో 1 ఉన్నాయి. వీటిని కూడా వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఇంకా ఏయే నిర్మాణాలు జరుగుతున్నాయి?

ఎస్ఇ : రైతు భరోసా కేంద్రాలు 447కు గాను 80 పూర్తి అయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. హెల్త్ సెంటర్స్ 354కు గాను 29 పూర్తిగా నిర్మాణాలు అయ్యాయి. మిగతా భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. కోల్డ్ స్టోరేజ్‌లు మొత్తం 64 కాగా 2 పూర్తి అయ్యాయి. మిగతావి నిర్మాణ దశల్లో ఉన్నాయి. వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీలు 149 గాను ఇంకా ఎక్కడ పూర్తికాలేదు. ఇవన్నీ వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి కాకుండా ఇంకా ఏమైనా రహదారుల నిర్మాణాలు మంజూరు అయ్యాయా?

ఎస్ఇ : ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద జిల్లాకు రూ.19 కోట్లు మంజూరు అయ్యాయి. గూడూరు, కోడుమూరు మీదుగా వయ చనుగొండ్ల రోడ్, గార్గేయపురం నుండి పసుపల వయ శివరమాపురం రుద్రవరం దాకా, నంద్యాల పార్లమెంట్ పరిధిలో ఉలిందకొండ నుండి కోడుమురు, వెల్దుర్తి వయ కొంగణపాడు వరకు.,అలాగే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం ఉలిందకొండ నుండి కోడుమూరు వెల్దుర్తి వెళ్లే దారిలో నిర్మాణాలకు కలిపి రూ.19 కోట్లు మంజూరు అయ్యాయి.

జగనన్న కాలనీ ముఖద్వారాల పనులు ఎలా చేస్తారు?

ఎస్ఇ: జిల్లాలో జగనన్న కాలనీల్లో ముఖ ద్వారాలకు 40 కాలనీలకు ఏర్పాటుకు మంజూరు జరిగింది. ఒకొక్క ముఖద్వారానికి రూ.4.15 లక్షలు మంజూరయ్యాయి. నామినేటెడ్ కింద ఈ పనులు చేస్తారు. ఇంకా మొదలు కాలేదు. జూలై నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

మీ కుటుంబ నేపథ్యం, మీ విద్యాభ్యాసం గురించి?

ఎస్ఇ : మాది చిత్తూరు జిల్లా పీలేరు మండలం గుండ్రేవారి పల్లె. తండ్రి వెంకటస్వామి, తల్లి జయమ్మ. భార్య స్వరూప లక్ష్మీ ఎపిజిఎల్ఐలో సూపరింటెండెంట్‌గా రిటైర్డ్ అయింది. ముగ్గురు అమ్మాయిలు సంతానం. అందరికి వివాహాలు అయ్యాయి. బాల్యంలో ఊరిలోనే 5 వరకు చదివాను. 5 నుండి మా ఊరి పక్కన బిజినేపల్లిలో 10 వరకు చదివా.పీలేరులో ఇంటర్, బిటెక్ జేఎన్టీయూలో పూర్తి చేశాను. 10వ తరగతిలో మండలంలో ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను. మొదటి ర్యాంక్ సాధించాను. అలా విద్యాభ్యాసం పూర్తి చేశాను.

ఉద్యోగ ప్రస్థానం ఎలా ఎక్కడ నుండి మొదలయింది?

ఎస్ఇ : 1987లో సర్వీస్ కమిషన్ ద్వారా మొట్టమొదటి సారి గుత్తిలో ఏఈఈగా జాయిన్ ఆయన. అక్కడ నుండి కర్నూలులో మిద్దూర్, కల్లూరు మండలాల్లో చేశాను, 1994లో డిఈగా ప్రమోషన్‌తో ఎమ్మిగనూరుకు బదిలీ అయ్యాను. ఆలూరు, కోవెలకుంట్లలో ఆర్‌డబ్ల్యూఎస్ డిఇగా కర్నూలులో, నందికొట్కూరులో చేశాను. 2009లో ఇఇగా ప్రమోషన్‌తో మహబూబ్ నగర్‌కు అసిస్టెంట్ డైరెక్టర్ డ్వామాగా చేశాను. అక్కడ నుండి బదిలీపై కర్నూలులో ఎస్ఎస్ఏలో ఇఇగా మొదటిసారి నా నుండి మొదలు అయింది. ఆ తరువాత అదోనిలోకి బదిలీ ఆయ్యాను. 2013 నుండి 2019 దాకా చేశాను. 2019లో ఎస్ఈగా ప్రమోషన్‌తో కోస్తాంధ్ర లో చేశాను. 2020లో కర్నూలు పంచాయితీ రాజ్ ఎస్ఇగా వచ్చాను.

మీ సర్వీస్ లో బాగా గుర్తు ఉండే పనులు, అవార్డులు ఏమైనా ఉన్నాయా?

ఎస్ఇ : కోడుమూరు దగ్గర తిప్పనూర్ బ్రిడ్జి ఛాలెంజ్ గా చేశాము. దేవనగర్ నుండి కల్లూరు వెళ్లే బ్రిడ్జి బాగా చేశాము. ఎస్ఎస్ఏలో ఉండగా బాగా చేసాను. ఆ తరువాత అదోనిలో చాలా పనులు నిర్మాణం చేశాము. రెండు సార్లు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవలకు అవార్డులు అందుకున్నాను.

స(మ)ండే ఎండ

- తీవ్రమైన భానుడి భగభగలు - గతేడాది కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో ఎండ మండుతోంది. మార్చి చివరి వారానికి భానుడి భగభగలు తీవ్రమయ్యాయి. గతేడాదితో పోలిస్తే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడిమి నుంచి కాపాడుకోవడానికి జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు...

మార్చి చివరి వారానికి భానుడు భగభగలాగుతున్నాడు. జిల్లాలో వేసవి తీవ్రత పెరిగింది. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నెల ప్రారంభంలో కర్నూలు నగరంలో అత్యధికంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయంలో 36 డిగ్రీలు, ఆలూరులో 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు అయింది. ఆదివారం కర్నూలు, ఓర్వకల్లులో అధికంగా 39 డిగ్రీలు, ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరులో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ వేడిమితో మధ్యాహ్నం నిప్పుల కొలిమిలా ఎండ తీవ్రత కనిపిస్తోంది. మే నెలాఖరు వరకు ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయోనని జిల్లా వాసులు భయపడుతున్నారు. ఇప్పటికే ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. కర్నూలు నగరంలోని రాజ్ విహార్ కూడలి, కలెక్టరేట్, బళ్లారి చౌరస్తా, కొత్త బస్టాండ్ ప్రాంతం, కొండారెడ్డి బురుజు ప్రాంతాలు మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరగనుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తరువాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

కర్నూలు రాజ్‌విహార్ కూడలిలో ఎండలో నిలిచిన్న వాహనదారులు

జాడలేని చలువ పందిళ్లు

ఎండ వేడిమి నుంచి వాహనదారులు ఉపశమనం పొందేందుకు కర్నూలు నగరంలో గతంలో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. గతేడాది కూడా భానుడు ఉగ్రరూపం దాల్చిన తరువాత నగరంలోని రాజ్ విహార్ కూడలి, సి.క్యాంప్, బళ్లారి చౌరస్తా, కలెక్టర్ కార్యాలయం వంటి ట్రాఫిక్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో, ప్రయాణికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఆ రకమైన చర్యలేమి చేపట్టలేదు. ఎండ వేడిమి ప్రారంభమైన నేపథ్యంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని నగర వాసులు కోరుతున్నారు.

వేసవిలోనూ తాగునీటి సమస్య ఉండదు

పెద్దపాడులో లక్ష లీటర్ల సామర్థ్యంగల సంపు ప్రారంభం - మేయర్, ఎమ్మెల్యే కాటసాని,కమిషనర్

సంపు, పైప్‌లైన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బివై. రామయ్య, కమిషనర్ భార్గవ్ తేజ, పాణ్యం నియోజవర్గ వైసిపి యువనేత కాటసాని శివనరసింహా రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర ప్రజలకు వేసవి కాలంలోను సాఫీగా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకున్నామని నగర మేయర్ బివై. రామయ్య అన్నారు. ఆదివారం డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక ప్రాతినిధ్యం వహిస్తున్న 36వ వార్డు పెద్దపాడు గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన సంపు, పైప్ లైనును మేయర్, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, కమిషనర్ భార్గవ్ తేజ, పాణ్యం నియోజవర్గ వైసిపి యువనేత కాటసాని శివనరసింహా రెడ్డి ప్రారంభించారు. రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మునగాలపాడులో రూ.12 కోట్లతో చేపట్టిన 15 ఎంఎల్‌డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పనులు వచ్చే నెల మొదటి వారంలో పూర్తి చేస్తామన్నారు. తద్వారా ఈ వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య ఉండదన్నారు. కొన్ని పత్రికలు గండం అంటూ పెద్ద పెద్ద అక్షరాలతో దుష్ప్రచార కథనాలు రాసి ప్రజలు భయాందోళనలకు గురయ్యేలా ప్రచురించడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పెద్దపాడు గ్రామ ప్రజల దశాబ్దాల కల నెరవేరిందన్నారు. ఇకపై పెద్దపాడులో తాగునీటి సమస్య ఉండబోదని చెప్పారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక కల్లూరు ప్రజల తాగునీటి సమస్య చాలా వరకు తగ్గించామని, గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎక్కడికక్కడ సమస్యలు అక్కడిగానే ఉండేవన్నారు. గత నాలుగేళ్లుగా తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాలన్నింటిని మెరుగుపరిచామన్నారు. కార్యక్రమంలో వైసిపి కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు వైజ అరుణ, కార్పొరేటర్లు విక్రమసింహ రెడ్డి, సంగాల సుదర్శన్ రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, లక్ష్మికాంత రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రమాదేవి, కో ఆప్షన్ మెంబర్లు కృష్ణమూర్తి, సుకన్య, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్ రెడ్డి, డిఇఇ రాజశేఖర్, రవిప్రకాష్ నాయుడు, ఎఇ జనార్ధన్, నాయకులు శ్రీధర్ రెడ్డి, బాలచంద్రారెడ్డి , రంగారెడ్డి, గోపాల్ రెడ్డి, శివరాం, చిన్న, సాయి పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీ జయప్రదం చేయండి

పందిపాడులో ఆటో జాతా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ కోరారు. ఆదివారం కల్లూరు మండలం పందిపాడు గ్రామంలో ఆటో జాతా ప్రచార కార్యక్రమాన్ని జి.రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కౌలు రైతులు ఆరుకాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక వ్యవసాయం నుండి వైదొలుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫారస్లను అమలు చేస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తమ మేనిఫెస్టోలో ప్రకటించాయని గుర్తు చేశారు. రైతు పండించిన పంటలకు పెట్టుబడికి అదనంగా 50 శాతం వేసి కేంద్ర ప్రభుత్వం కల్పించాలని కోరుతూ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కౌలు రైతులకు రక్షణ కల్పిస్తూ ఒక చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో కనీసం రూ. రెండు లక్షల కోట్లు కేటాయించాలని, తద్వారా ప్రతి కుటుంబానికి రెండు వందల రోజులు పనులు కల్పించి రోజువారి వేతనం కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లకు ఫ్యాక్టరీ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని పదవి విరమణ అనంతరం వారి జీవితంలో సగం కనీసం రూ.పదివేలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. రేషన్ షాపుల ద్వారా కేరళ తరహాలో 14 రకాల నిత్యావసర సరుకులు చౌక ధరల దుకాణం ద్వారా అందించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ప్రధాన డిమాండ్ల పరిష్కారం కోసం చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కృష్ణ, సిఐటియు మండల కార్యదర్శి మధు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఆంజనేయులు, పందిపాడు శ్రీను, పుల్లన్న, పెద్దపాడు గోపి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

బిఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ , కుడా చైర్మన్

పోలకల్ లో బిఎంఆర్ ఎంటర్ ప్రైజెస్ ప్రారంభం

ముఖ్య అతిథులుగా కూడా చైర్మన్ ,ఎమ్మెల్సీ హాజరు

ప్రజాశక్తి-సి బెళగల్ : మండలంలోని పోలకల్ గ్రామంలో వైసిపి నాయకులు బుల్లెట్ పులిరాజుకు గల బిఎంఆర్ ఎంటర్ ప్రైజెస్‌ను కుడా చైర్మన్ కోట్ల హర్ష వర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ ఆదివారం ఘనంగా ప్రారం భించారు. ప్రముఖులు వస్తున్నారని తెలిసి మండలంలోని ఆయా గ్రామాల వైసిపి శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వారికీ స్వాగతం పలికారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి గెలుపునకు కృషి చేయాలని కోరారు.

డాక్టర్ ఆదిమూలపు సతీష్‌కు అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు ఏ క్యాంపు మదర్ తెరిసా ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను వైసిపి అనుబంధ విభాగమైన డాక్టర్స్ స్టేట్ కార్యవర్గానికి కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా వైసిపి అనుబంధ విభాగాల అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని తాడేపల్లి కార్యక్రమంలో డాక్టర్ ఆదిమూలపు సతీష్‌ను అభినందించారు. కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, మైపర్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. సురేష్, అధ్యాపకులు ఆధ్యాపకేతర సిబ్బంది, ఎస్ఆర్‌సిడి బిఇడి కళాశాల, సాయి కృష్ణ, ఎ.తెరిసా, డిగ్రీ కళాశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : కర్నూలు నగరంలో లక్ష్మీ నగర్‌కు చెందిన ఓ వ్యక్తి అప్పుల బాధను తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు. కోడుమూరు మండలం రామాపురం డబ్బర సుధీర్ కుమార్ (35) కర్నూలు నగరం లోని లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఓవైపు ఆటో నడుపుతూ గ్రామంలో తనకున్న రెండు ఎకరాల పొలంతో పాటు, మరో5 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. గత కొంతకాలంగా తన కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. వ్యవసాయం కోసం చేసిన అప్పుల ఒత్తిడి పెరగడంతో ఈనెల 24న సాయంత్రం శనగ పంట పొలానికి విని యోగించే గుళికలను మద్యంలో కలుపుకొని తాగాడు. చికిత్స నిమిత్తం కర్నూలు కిమ్స్ ఆసుపత్రిలో చేర్చారు. కోలుకోలేక శనివారం సాయంత్రం మృతి చెం దాడు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసుకుని విచారిస్తు న్నారని మృతుని అన్న రాముడు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.మృతుని కుటుంబానికిన్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి: ఎస్‌పి

ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంగించే వారిపై చర్యలు తప్పవని జిల్లా ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ అన్నారు. ట్రాఫిక్ మిత్రలో భాగంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడినట్లు ప్రజలు, యువకులు పంపించిన ఫోటోల ఆధారంగా ఇప్పటి వరకు నమోదైన ఫిర్యాదులను వివరాలను ఆయన వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం..3,304 మంది పై ట్రాఫిక్ మిత్రకు ఫిర్యా దులు వచ్చాయి. కర్నూలు ట్రాఫిక్ పోలీసు విభాగం వారు నిర్ధారణ చేసి 204 మంది పై రూ. 1 ,24,646 జరిమానా విధించారు. గత వారం రోజులుగా ఈనెల 19 నుంచి 25వరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనలో భాగంగా డ్రైవింగ్ లైసెన్సులు లేని వారిపై 71 కేసులు నమోదయ్యాయి. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన వారిపై 2,242 కేసులు, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడిపిన వారి పై 77 కేసులు, జంపింగ్ సిగ్నల్ పై 6 కేసులు, ఎలాంటి రికార్డులు పత్రాలు లేకుండా వాహనాలు నడిపిన వారి పై 2,940 కేసులు నమోదయ్యాయి. సీటు బెల్టు ధరించకుండా వెళ్తున్న కార్లు , జీపులు , తదితర వాహన చోదకుల పై 217 కేసులు, అతి వేగంతో వెళ్లి న వాహనాల పై 691 కేసులు, ఓవర్ లోడ్ తో వెళ్ళిన వాహనాల పై 60 కేసులు, ట్రిపుల్ రైడింగ్ పై 296 మంది కేసులు, రాంగ్ పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాల పై 103 కేసులు నమో దయ్యాయి. రాంగ్ పార్కింగ్ చేసిన త్రీ వీలర్ , ఫోర్ వీలర్ వాహనాల పై 144 కేసులు, నంబర్ ప్లేట్ లేని 115 వాహనాలు సీజ్ చేసి మొత్తం రూ.5.45 లక్షల ఈ చలనాలు పెండింగ్ లో ఉన్నాయి. 7,557 ఈ చలనాలను (రూ. 13 లక్షల 90 వేలు) రికవరీ చేశారు. వాహన దారులు ట్రాఫిక్ పోలీసుల నిబంధనలు పాటిస్తూ గమ్యాలకు క్షేమంగా చేరాలని ఈ సంధర్బంగా జిల్లా ప్రజలకు జిల్లా ఎస్‌పి విజ్ఞప్తి చేశారు.

ఘనంగా అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు టెక్కలి ఎమ్మెల్యే కె.అచ్చెన్నాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం టిడిపి శ్రేణులతో కలిసి పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ మహిళ అధ్యక్షురాలు కె. పార్వతమ్మ, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు బ్రహ్మణ పల్లె నాగిరెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్ గౌడ్, లక్ష్మీపురం పుల్లారెడ్డి, బీసన్న, చరణ్, దొడ్డిపాడు బాషా, ఖాజా, నెర్వడ జాఫర్, బొల్లారం కెవి.రమణ రెడ్డి,ఎంయు.వియన్ రాజు యాదవ్, రెడ్డిపోగు బజారన్న, ఉలిందకొండ కరీం, షేక్షా పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న టిడిపి నంద్యాల అధ్యక్షులు గౌరు వెంకట్‌రెడ్డి

సెక్యూరిటీ గార్డ్స్ పెండింగ్ జీతాలు చెల్లించాలి

జి జిహెచ్ గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సెక్యూరిటీ గార్డ్స్‌కు జీతాలు ఇవ్వాలని సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ దేశాయ్, ఎం.రాజశేఖర్, సివిల్ సప్లయ్స్ హమాలీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం రెండోరోజు డ్యూటీ పాయింట్ నుండి ర్యాలీగా వెళ్లి హాస్పిటల్ గాంధీ విగ్రహం ముందు సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నాయకులు బాల తిమ్మయ్య అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. కృష్ణ తదితరులు మాట్లాడుతూ ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ పండగకు కూడా జీతాలు ఇవ్వకుండా సెక్యూరిటీ గార్డ్స్ సూపర్‌వైజర్స్ కుటుంబాలను ఇబ్బందులు పడేటట్లు చేస్తుందన్నారు. జీతాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి పండగ చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. హాస్పిటల్ సూప రింటెన్‌డెంట్ కూడా హాస్పిటల్లో ఏం జరుగుతుందో కార్మికులకు జీతాలు అందు తున్నాయో లేదో కూడా పర్యవేక్షణ చేయడం లేద న్నారు. ఏజెన్సీలు ఏమి చెప్తే అదే సరైనదన్నట్లుగా సూపరింటెండెంట్ వత్తాసు పలుకుతున్నారన్నారు. డిఎ కూడా పెంచకుండగా ఎక్స్‌ఫర్ట్ ఏజెన్సీ కాల యాపన చేస్తుందన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కూడా కరెక్టుగా సెక్యూరిటీ గార్డ్స్‌కు కల్పించడం లేదన్నారు. ఏజెన్సీ వారు తక్షణమే పెండింగులో ఉన్న జీతాలను ఇవ్వా లని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సూపరిన్‌టెన్‌డెంట్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు. సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ కార్మికులు మధు, కె. రానా ప్రతాప్, మోహన్ రావు, అయ్యన్న, నర్సప్ప, మురళి, మారెన్న, జాతన్న, వెంకన్న, కిరణ్, సిఐటియు నగర నాయకులు కె. రామకృష్ణ పాల్గొన్నారు.

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అబ్దుల్‌దేశాయి

నేడు శారదమ్మ వైకుంఠ సమారాధన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆదర్శ విద్యసంస్థల అధినేత బి.తిమ్మయ్య సతీమణి పందబోయిన వాణి శారదమ్మ వైకుంఠ సమారాధన సోమవారం నిర్వహిస్తున్నారు. ఆమె తిరుపం, లక్ష్మమ్మ దంపతులకు 1940లో కోవెలకుంట్ల మండలం వెలగటూరు గ్రామంలో జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎంఏ ఎకనామిక్స్ పూర్తి చేశారు. ఆత్మకూరు, ఎమ్మిగనూరులలో ప్రభుత్వ టీచర్‌గా పనిచేశారు. కెవిఆర్, సిల్వర్ జూబ్లీ కళాశాలలో డిగ్రీ లెక్చరర్‌గా విధులు నిర్వహించి ఎందరో విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిర పడటంలో ముఖ్య పాత్ర పోషించారు. పదవి విరమణ అనంతరం శంకరాస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గా పనిచేశారు. ఈమెకు కుమారుడు బి.హరికిషన్, కుమార్తె బి. రమాదేవి ఉన్నారు.

ఆరోగ్య మిత్రులకు కనీస వేతనం అమలు చేయాలి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్ : ఆరోగ్య మిత్రలో పనిచేస్తున్న కార్యకర్తలకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆరోగ్యమిత్ర కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని శాసనమండలిలో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ప్రస్తావించడం పట్ల అంజిబాబు పిడిఎఫ్ ఎమ్మెల్సీలకు ధన్యవాదాలు తెలిపారు. ఆరోగ్య మిత్రులు 16 యేళ్లుగా పనిచేస్తున్నా వారికి కేవలం రూ.13 వేల మాత్రమే చెల్లిస్తున్నారని అన్నారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు ఉండేటట్లు చూడాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. లేదంటే వారి సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆందోళనకు సిద్ధమవుతుందని హెచ్చరించారు.

31న ఎఐవైఎఫ్ రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న గ్రూప్ 1, 2,మెగా డిఎస్సి, పోలీస్ శాఖ పోస్టుల భర్తీకి మార్చి 31న కర్నూలులో జరిగే రాష్ట్ర సదస్సును జయ ప్రదం చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి కోరారు.ఆదివారం సిపిఐ కార్యాలయంలో ఎఐవైఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసం చేస్తూ ప్రకటనలు చేస్తున్నారే తప్ప ఎక్కడా భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టడం లేదన్నారను. రాష్ట్ర ప్రభుత్వంపై గ్రూప్ నోటిఫికేషన్, మెగా డిఎస్సి, పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టుల భర్తీ కోసం ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు ఎఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర, లెనిన్ బాబు, నిరుద్యోగుల జెఎసి కన్వీనర్ సిద్దిక్, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య హాజరవుతారని తెలిపారు. ఈనెల 31న ఉద్యోగాల భర్తీ కోసం జరిగే రాష్ట్ర సదస్సుకు యువత తరలిరావాలన్నారు. ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు బీసన్న, శ్రీరాములు గౌడ్, చంటి, సూరి పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రముందు మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

బిజెపి ప్రతిపక్షాల గొంతు నొక్కుతోంది : కాంగ్రెస్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కుతొందని, అందులో భాగంగానే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేసిందని, ఎన్ని కుట్రలు చేసినా ప్రజావ్యతిరేక నిర్ణయాలపై ప్రశ్నిస్తూనే ఉంటామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బోయ నీలకంతప్ప, పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షులు దిలీప్ దొక,యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మారుతి అన్నారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు రాహుల్ గాంధీకి మద్దతుగా సంకల్ప సత్యాగ్రహ దీక్ష కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో అప్రజాస్వామ్య దిశగా కేంద్ర ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందన్నారు. రాహుల్ గాంధీపై హడావుడిగా పార్లమెంట్ సభ్యత్వం అనర్హత వేటు ఏక పక్ష నిర్ణయం అని మండిపడ్డారు. అదానీ మోడీ బంధాలపైన సాగుతున్న చర్చను దారి మళ్లించాలనే ఉద్దేశ్యంతోనే రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేశారని అన్నారు. ఈ సందర్భంలో రాహుల్ గాంధీకి అండగా నిలిచి మోడీ ప్రభుత్వ కక్ష పూరిత వైఖరిని ఖండించిన ప్రతిపక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సాయినాత్, ఐఎన్టీయుసి ఇర్ఫాన్, పట్టణ కాంగ్రెస్ సహాయ కార్యదర్శి నిసర్ అహ్మద్, కోశాధికారి మణిక్యరాజు, ఫరూక్, షైక్షవాలి, సుంకన్న, ప్రభుదాస్, రోషన్, మద్దిలేటి పాల్గొన్నారు.

28న వాహనాల వేలం : సెబ్ సిఐ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు సెబ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలను ఈ నెల 28వ తేదీన వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు సెబ్ సిఐ పి.ఈ వెంకట్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. నంద్యాల ఎన్ఫోర్స్మెంట్ సూపరిండెంట్ శ్రీధర్ రావు ఆధ్వర్యంలో ఆలూరు సెబ్ స్టేషన్ ఆవరణలో పట్టుబడిన కార్లు, ఆటోలు, మోటార్ సైకిళ్లను వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఉదయమే స్టేషన్‌లో దరావతు (డిపాజిట్ మొత్తం రూ 5వేలు చెల్లించి పాల్గొనాలన్నారు.

పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

- తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు : సిఐ మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - గోనెగండ్ల

రంజాన్ మాసం, త్వరలోనే శ్రీరామనవమి పండుగ రానున్న దృష్ట్యా మండలంలో ప్రజలు పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్ సిఐ మోహన్ రెడ్డి గోనెగండ్ల ఎస్సై తిమ్మారెడ్డి అన్నారు. మండల కేంద్రమైన గోనెగండ్లలోని పోలీస్ స్టేషన్లో ఆదివారం సాయంత్రం అన్ని సామాజిక వర్గాల పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి సామరస్యంతో పరస్పర సహకారంతో ప్రజలు మెలగాలని సూచించారు. ఏ సంఘటన జరిగినా ఎలాంటి సమస్య ఉన్న ఉద్రిక్తలకు గొడవలకు లోను కాకుండా తమ దృష్టికి తేవాలని సూచించారు. సోషల్ మీడియాలో ఇతర ప్రచార మాధ్యమాల్లో వచ్చే సమాచారాన్ని నిర్ధారించుకోకుండా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సైలు వెంకటేశ్వర్లు, తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీ అల్వాల వెంకట రామిరెడ్డి, గ్రామ పెద్దలు అబ్దుల్ రెహమాన్, జలీల్, ఎస్బి మన్సూర్, చికెన్ రాజా, భాస్కర్ రెడ్డి, డాక్టర్ శివ, వీరన్న గౌడ్, హుస్సేన్, హుస్సేన్ పటేల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రూరల్ సర్కిల్ సిఐ మోహన్ రెడ్డి

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు

ప్రజాశక్తి - మంత్రాలయం

'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని కార్మికులు, కర్షకులు, మజ్దూర్ కిసాన్ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు కోరారు. ఆదివారం సిఐటియు మండలం కార్యదర్శి హెచ్ జయరాజు, కెవిపిఎస్ మండల కార్యదర్శి అనిల్‌తో కలిసి చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల, కర్షకుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఏప్రిల్5వ తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం తలపెట్టారన్నారు. కార్మికులు, కర్షకులు మజ్దూర్ కిసాన్ ర్యాలీ జంతర్ మంతర్ దగ్గర లక్షలాది మందితో కలిసి చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యలపై జరుగుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. **ఎమ్మిగనూరు** : ఏప్రిల్ 5వ చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసా య కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు నాయకులు సి హనుమంతు, ఎస్ తిమ్మన్న, బి రాముడు కోరారు. ఆదివారం సుందరయ్య భవన్లో ఢిల్లీ జయప్రదం కొరకు వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి రామాంజనేయులు పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. రైతు సంఘం నాయకులు రైతు సంఘం నాయకులు నరసింహులు,ఎం అబ్దుల్లా, రాజు, రమేష్,, శేషు,నాగరాజు తదితరు లు పాల్గొన్నారు. **ఆదోనిరూరల్ :** ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీ నడిబొడ్డున జరుగుతున్న కార్మిక, కర్షక ప్రదర్శనలో లక్షలాదిమంది పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే లింగన్న పేర్కొన్నారు. ఆదివారం ఆదోని మండలంలోని దిబ్బనకల్లు, సలకలకొండ, బసరకోడు, అలసంద గుత్తి, హువ్వనురు, విరుపాపురం, సాదాపురం, గోనబావి గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. సిఐటియు మండల ఉపాధ్యక్షులు తిక్కప్ప, డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శ్రీకృష్ణ, మండల నాయకులు రమేష్ పాల్గొన్నారు.

గోడ పత్రికలు పత్రికల ఆవిష్కరిస్తున్న సిఐటియు జిల్లా

ఎమ్మిగనూరు : గోడ పత్రికలు పత్రికల ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆదోనిరూరల్ : మాట్లాడుతున్న

అక్రమ కనెక్షన్లతో తాగునీటికి ఇక్కట్లు

ప్రజాశక్తి - నందవరం

వేసవి మొదలైంది. గ్రామాల్లో తాగునీరుకి ఎక్కడపడితే పైప్‌లైన్లకు కుళాయిలు వేయడంతో తాగునీరు సరఫరా కాక కొన్ని కాలనీల ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిట్టా సోమాపురం గ్రామం తుంగభద్రా నదికి రెండు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. నది నుండి గ్రామంలోకి పైప్‌లైన్లు వేసి ఓహెచ్ఎస్ ట్యాంకు నీటిని సరఫరా చేస్తు న్నారు. ఓహెచ్ఎస్ ట్యాంకు వచ్చే పైప్లైన్‌లకు కొంతమంది అక్రమంగా కుళాయిలు వేసుకోవడంతో ట్యాంక్‌కు నీటి సరఫరా ఆగిపోయింది. గ్రామంలో 25శాతం మంది ప్రజలకు మాత్రమే నీటి సరఫరా జరుగుతు ఒడడంతో, 75శాతం మంది ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్ ప్రవేశపెట్టి ఇంటింటికి తాగునీటి కుళాయి అందిస్తామని చెప్పి, 20 ఇళ్లకు ఒక కుళాయి కూడా ఇచ్చే స్థితిలో తమ గ్రామం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పంచాయతీ, తాగునీటి శాఖ అధికారులు దృష్టికి తీసుకువెళ్లిన సమస్య పరిష్కారించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే వేసవికాలం మొదలవుతుండడంతో పూర్తి వేసవిలో ఇంకా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంద న్నారు. గ్రామస్తులు అందరూ కలిసి సర్పంచ్ ఇంటి దగ్గరికి వెళ్లి ఆమె కుమారుడిని తాగునీటి సరఫరాపై ప్రశ్నించగా నది నుండి దాదాపు 8 గంటలసేపు నీటి సరఫరా చేయిస్తున్నా మన్నారు. అక్రమ కలెక్షన్లు వేయడంతోనే నీటి సరఫరా చేయలేకపోతున్నా మన్నారు. మా పరిధిలో ఉన్నంతవరకు సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ కుమారుడు నరసింహులు తెలిపారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు పెద్దారెడ్డి, గోవిందు, ఉరుకుందు, రమేష్, ఈరన్న, వెంకటేష్, పరశరాముడు, భాస్కర్ రెడ్డి, రాముడు, బొజ్జన్న, మద్దమ్మ, తిప్పమ్మ, లక్ష్మీ, రామలింగమ్మ, జనార్ధన్, రామకృష్ణ, రామలింగడు, చిన్న రాముడు, రమేష్, లింగన్న, నరసింహులు, లింగమ్మ, బజారిలు కోరారు.

నీటి సరఫరా లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్న

28న బడేసాహెబ్ నెల ఉరుసు

రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు

గంజి హళ్లి బడే సాహెబ్ దర్గా

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండల పరిధిలోని గంజహళ్లి గ్రామంలో వెలసిన మహత్మ బడేసాహెబ్ స్వామి నెల ఉరుసు ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 27న సోమవారం గంధం, 28న మంగళవారం ఉరుసు, 29న బుధవారం జియారత్ కార్యక్రమాలతో నెల ఉరుసు ఉత్సవాలు ముగియనున్నట్లు దర్గా ధర్మకర్త ఆర్ కుబేర రెడ్డి, వంశపారంపర్య పీఠాధిపతులు సయ్యద్, చిన్నముద్గోల్ మాబు సాబ్, ఇమాంసాబ్ హుస్సేన్ సాబ్ తెలిపారు. ప్రధానంగా మంగళవారం ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకుం టారని అన్నారు. స్వామివారి జీవ సమాధిని ప్రత్యేక పూలతో అలంకరించామన్నారు. 'హజా' కార్యక్రమంలో వేలాది మంది భక్తులు హజరవు తారన్నారు. ఈ సందర్భంగా ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలు

రాష్ట్ర స్థాయి న్యూకేటగిరి ఎద్దుల బండలాగుడు పోటీలు మంగళవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.50వేలు, రెండవ బహుమతి రూ40 వేలు, మూడవ బహుమతి రూ 30వేలు, నాల్గవ బహుమతి రూ.20వేలు, ఐదో బహుమతి రూ10వేలు అందజేస్తున్నామన్నారు. ఆసక్తిగల వారు రూ.600 లు ప్రవేశ రుసుము చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

సంగీత ఖవ్వాలి ప్రదర్శనలు

సోమవారం సాయంత్రం నుంచి కూచిపూడి నృత్య ప్రదర్శన, భజన గీతాలు, అన్నమయ్య సంకీర్తనలు, ఖవ్వాలి గీతాలాపన జరుగుతున్నట్లు తెలిపారు. బండలాగుడు పోటీలలో పాల్గొనేవారు ఇతర వివరాలకు 9441181021, 788972 8402, 9666030606 ఫోను నెంబర్‌లను సంప్రందిచాలని తెలిపారు.

కేంద్ర మంత్రి నారాయణ స్వామికి స్వామి వారి చిత్ర పటాని అందజేస్తున్న శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు

రాఘవేంద్రుని దర్శించుకున్న కేంద్ర మంత్రి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన శ్రీ రాఘవేంద్రస్వామిని కేంద్ర దేవాదాయ శాఖ మంత్రి, రాష్ట్ర సామాజిక న్యాయం బాధ్యతలు నిర్వహిస్తున్న నారాయణస్వామి ఆదివారం దర్శించుకున్నారు. దర్శనార్థం ఆలయం చేరుకున్న ఆయనకు శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రుని మూల బృందావనాన్ని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రథీర్థులను కలుసుకుని ఫల పుష్ప హారాలు సమర్పించి నమస్కరించకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రథీర్థులు కూడా ఆయన్ను కుశల ప్రశ్నలు వేసి శేష వస్త్రం ఫల మంత్రాక్షతలు మెమొంటో అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కర్నాటక రాష్ట్ర బిజెపి నాయకులు గిరీష్ కనకవీడు, సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

సిఎం వైఎస్ జగన్, వాల్మీకి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న వాల్మీకి నాయకులు

బోయలకు ఎస్‌టి రిజర్వేషన్ అసెంబ్లీ తీర్మానం హర్షణీయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

బోయ వాల్మీకులను ఎస్టీలుగా అసెంబ్లీలో తీర్మానం చేసిన ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వాల్మీకి సోదరులు రుణపడి ఉంటారని వైసిపి జిల్లా కార్యదర్శి, వాల్మీకి సీనియర్ నాయకులు టి నాగేష్ నాయుడు, వైసిపి నాయకులు వాల్మీకి నాయకులు కోటేకల్ సర్పంచ్ లక్ష్మన్న, విజిఆర్ కొండయ్య బిటి లక్ష్మన్న టీ మురళి నాయుడు, యాపిలయ్యా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అజంతా ఫంక్షన్ హాల్‌లో సీఎం జగన్మోహన్ రెడ్డి, వాల్మీకి మహర్షి చిత్ర పటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాదయాత్రలో భాగంగా వాల్మీకుల విన్నపం మేరకు వాల్మీకులను గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి స్థితిగతులను పరిశీలించిన అనంతరం అసెంబ్లీ తీర్మానం చేయించడం జరిగిందన్నారు. వాల్మీకులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే జగన్మోహన్ రెడ్డితోనే సాధ్యమన్నారు. బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ బీసీలకు పెద్దపీట పార్టీ వైసీపీ ప్రభుత్వం అని పేర్కొన్నారు. ప్రతి వాల్మీకి సోదరుడు పార్టీలకతీతంగా ఆహ్వానించదగ్గ విషయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ వాల్మీకి నాయకులు ఎల్లం బీడు లక్ష్మన్న పుట్ట పాశం మాజీ సర్పంచ్ గంగాధర్, లింగమూర్తి పుండుకూ ర రంగన్న, ఎల్ఐసి వాల్మీకి రంగస్వామి, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు జరుపుకుంటున్న నాయకులు

భీమ యూత్ ఆర్థిక సాయం

- అండగా ఉంటామన్న వై. సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి వైద్య ఖర్చులకు బీమా యూత్ తరుపున రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆదివారం రాంపురం గ్రామంలో వైసిపి నాయకులు, ఎమ్మిగనూర్ ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వై సీతారామిరెడ్డి బాధితుడి భార్యకు నగదును అందజేశారు. రెండు నెలల క్రితం మాధవరం గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తుంగభద్ర గ్రామానికి చెందిన అర్విన్ రాజు అనే వ్యక్తి గాయపడి కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న భీమ యూత్ కమిటీ సభ్యులు ఈ సహాయం చేశారు. బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని వై సీతారామి రెడ్డి హామీ ఇచ్చారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న వై. సీతారామిరెడ్డి

కుక్కల పట్టివేత ముమ్మరం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో యుద్ధప్రాతిపదికన వీధి కుక్కలు పట్టివేత ప్రక్రియ మొదలైందని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆదోని పట్టణంలో ప్రత్యేక బృందం చేత వీధి కుక్కలను పట్టి బోన్‌లో తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. కుక్కలు బెడద తీవ్రంగా ఉందని వచ్చిన వినతులు మేరకు వాటి సంతతి తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. హనుమన్ నగర్, బుడేకల్, పెద్దకమేళా, నిజాముద్దీన్ కాలనీ, ఖాజీపుర ప్రాంతాలలో కుక్కల పట్టివేత ప్రక్రియ జరిగిందన్నారు. పట్టణంలో సుమారుగా 4,000 వీధి కుక్కలు ఉన్నాయని గుర్తించామన్నారు. ఆడ కుక్కలకు సంతతి నిరోధక ఆపరేషన్ ప్రక్రియ కూడా మొదలు అయిందన్నారు. నెలరోజులపాటు కుక్కలను బంధించి రంజాల వద్ద పశుసంవర్ధక శాఖ వైద్యుల సమక్షంలో ఆడ కుక్కలకు శస్త్ర చికిత్సలు జరుగుతాయన్నారు. వీధి కుక్కల పట్టివేతకు పురవాసులు సహకరించాలన్నారు.

కుక్కలు పట్టే బోన్ లో వేస్తున్న దృశ్యం

కుక్కలను పడుతున్న దృశ్యం

ఘనంగా అచ్చెన్నాయుడు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పుట్టినరోజు వేడుకలను ఆదోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆధ్వర్యంలో ఆదివారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆదోని తెలుగుదేశం పార్టీ మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ, వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మదిరే భాస్కర్ రెడ్డి, పట్టణ ముస్లిమ్స్ నాయకుడు సౌదీ రఫూఫ్, కర్నూల్ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు మాన్వి దేవేంద్రప్ప, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు గుడిసె శ్రీరాములు, బసాపురం రామస్వామి, సాంబగల్ ఫకృద్దీన్, వడ్డెమన్ గోపాల్, సోమశేఖర్ రెడ్డి, మురళ, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, రామ చంద్రప్ప, నారాయణ పురం షేక్షావలి, ఎండి హుసేన్, బిటి శ్రీనివాసులు, మలేష్, మద్దికెర రామకృష్ణ, పక్కిరప్ప, శివయ్య స్వామి ఆధ్వర్యంలో కేకును కట్ చేసి తినిపించుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి అచ్చం నాయుడు ఆయారారో గ్యాలతో ఉండి ప్రజా సేవకే అంకితం కావాలని ఆకాంక్షించారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రజా విశ్వాసం కోల్పోతున్నారని వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయ డంక మోగించి సీఎంగా చంద్రబాబు గద్దెనెక్కడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేటి నుండి కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - నందవరం

నందవరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆరవ తరగతి, ఇంటర్మీడియట్ (ఎంపీసీ గ్రూప్ మాత్రమే) ప్రవేశాలు పొందుటకు విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపల్ ఆర్. శైలజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరవ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ ఎంపీసీ గ్రూప్ నందు 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, 8, 9 తరగతులలో రెండేసి చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన వారు నేటి నుండి ఏప్రిల్ 20వరకు http://apkgbv.apcfss.inలో ఆన్లైన్‌లో మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. దరఖాస్తుదారులు ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ వర్గాలకు చెందిన వారై, దారిద్రరేఖ దిగువన ఉన్న వారు మాత్రమే అర్హులన్నారు. మాన్యువల్ దరఖాస్తులు స్వీకరించబడవని, దరఖాస్తుదారులు ఆన్లైన్‌లో మాత్రమే చేసుకొనుటకు విద్యార్థి ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రేషన్ కార్డ్ నంబర్(రైస్ కార్డ్), విద్యార్థి ఫోటో, స్టడీ సర్టిఫికెట్ (ఇందులో పుట్టిన తేదీ ఉండేటట్లు చూసుకోవాలి) తీసుకొని మీ సేవ, నెట్ ల్ ఆన్లైన్లో దరఖాస్తు, మరిన్ని వివరములకు ఇవ్వాలని, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపల్ లేదా సిబ్బందిని సంప్రదించాలన్నారు.

ఢిల్లీలో పోరాట ప్రదర్శనను జయప్రదం చేయండి

జీపు జాతాలో ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్

ప్రజాశక్తి - ఆదోని : రవాణా రంగ పరిరక్షణకై ఏప్రిల్ 5న ఢిల్లీలో జరుగు పోరాట ప్రదర్శనను జయప్రదం చేయాలని మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రభాకర్, ఈరన్న, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ కోరారు. ఆదివారం మోటార్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా జాత ఆదోని చేరుకుంది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు నామాల శివ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లా డారు. ఎన్నికల ముందు డ్రైవర్ల సంక్షేమానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిదని విమర్శించారు. కేంద్రం తీసుకొచ్చిన మోటార్ యాక్ట్ సవరణ బిల్లుతో రవాణా రంగానికి తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. పెట్రోలు, డీజిల్ నిత్యావసర సరుకులు ధరలు భారీగా పెరగడం వలన వాహ నాలు నడపలేక, ఫైనాన్స్ కంతులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రమాద బీమా సౌకర్యం, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కేంద్ర ప్రభుత్వం డ్రైవర్లను ఆదుకోవాలని చేపట్టే పోరాట ప్రదర్శనలోలైట్ వెహికల్ డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో లతీఫ్, లక్ష్మన్న, బాష, గని, లైట్ వెహికల్ డ్రైవర్లు పాల్గొన్నారు.

దేవనకొండ : రవాణా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 21 ద్వారా ఆటో, లారీ తదితర రవాణా కార్మికుల తీవ్రంగా నష్టపోతున్నారని వెంటనే ఆ జీవోను రద్దు చేయాలని ఆటో వర్కర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి వీరశేఖర్ డిమాండ్ చేశారు. రవాణా రంగ పరిరక్షణ కొరకు ఏప్రిల్ నెల 5వ తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఈ మేరకు ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల జాతా కార్యక్రమంలో భాగంగా దేవనకొండకు ఆదివారం జాతా చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షులు పాండు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు నాగేష్, ఆటో కార్మికులు రంగయ్య, రంగన్న, బ్రహ్మయ్య, రమేష్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కోడుమూరు వీరన్న, మస్తాన్, అబ్దుల్ ,స్థానిక సిఐటియు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. **ఆస్పరి:** రవాణా రంగం పరిరక్షణ కు కార్మికులంతా పోరాటాలకు సిద్ధం కావాలని ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.హనుమంతు కోరారు. ఆదివారం ఆస్పరిలో జీపు జాతా చేరుకుంది. వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటార్ యాక్ట్ సవరణ బిల్లు దేశంలో అనేక రాష్ట్రాలు వ్యతిరేకించిన మన రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం మాత్రం ఆగమేగాల జీవో 21 పేరుతో రవాణా రంగంపై అధిక జరి మానాలు, చలానా ధరలు భారీగా విదిస్తోందన్నారు. కోడు మూరు సిఐటియు మండల కార్యదర్శి ఈరన్న, ఆటో యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి ఉసేన్, రైతు సంఘం మండల నాయ కులు మల్లికార్జున, రంగప్ప, మల్లేష్, ఆటో యూనియన్ నాయకులు బలరాం, రంగస్వామి, సతీష్, పామన్న, ఖాదర్ బాష,సూరి,శివ పాల్గొన్నారు.

ఆదోని : కార్మికులను ఉద్దేశించి మాట్లాడిన ప్రభాకర్

దేవనకొండ : కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ఆస్పరి : జీపు జాతాలో మాట్లాడుతున్న నాయకులు

సండే ఎండ @ 41 డిగ్రీలు

- తీవ్రమైన భానుడి భగభగలు
- రోజు రోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రత

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

నంద్యాల జిల్లాలో ఎండ మండుతోంది. మార్చి చివరి వారంలోనే 41 డిగ్రీల ఉష్ణోగ్రతతో భానుడు భగభగలాడుతున్నాడు. రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతూ పోతున్నాయి. ఎండ వేడిమి నుంచి కాపాడుకోవడానికి జాగ్రత్తలు తప్పవని వైద్యులు సూచిస్తున్నారు...

మార్చి చివరి వారంలో భానుడు భగభగలాగుతున్నాడు. జిల్లాలో వేసవి తీవ్రత అధికమైంది. గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఈ నెల మొదటి వారంలో నంద్యాల, చాగలమర్రి, ఆళ్లగడ్డలో అత్యధికంగా 37 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఆత్మకూరులో 36 డిగ్రీలు, డోన్‌లో 35 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఆదివారానికి ఆ ఉష్ణోగ్రత 4 డిగ్రీలు అధికంగా నమోదైంది. నంద్యాల, చాగలమర్రి, ఆళ్లగడ్డలో 41 డిగ్రీలను తాకింది. ఆత్మకూరులో 40 డిగ్రీలు, డోన్‌లో 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మే నెలాఖరు వరకు ఎండలు ఎంత భయంకరంగా ఉంటాయోనని జిల్లా వాసులు భయపడుతున్నారు. ఇప్పటికే ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. అవసరమై రోడ్ల మీద తిరిగేవారు ఎక్కువగా చెట్ల నీడను ఆశ్రయిస్తూ కనిపిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరగనుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

ఎక్కువ ప్రమాదం ఎవరికంటే..

ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు

ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తరువాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గడివేముల

మండలంలోని గని గ్రామానికి చెందిన తుమ్మలూరు వెంకటరమణ (33) పిడుగు పడి మతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... గని గ్రామానికి చెందిన తుమ్మలూరు వెంకటరమణ గేదెలు, ఆవులను మేపుకుంటూ జీవిస్తున్నాడు. ఆదివారం పశువులను మేపడానికి గ్రామ సమీపంలోని పొలాల్లోకి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం 2 గంటలకు పశువులకు కొద్ది దూరంలో చెట్టు కింద భోజనం చేయడానికి వెళ్లాడు. భోజనం చేస్తుండగా ఉరుములు, మెరుపులతో పిడుగు పడడంతో వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వెంకటరమణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మృతి చెందిన వెంకటరమణ

పన్నుల వసూళ్లకు కొత్త మార్గం

- వన్‌టైం సెటిల్‌మెంటుతో ముందుకు
- నంద్యాలలో రూ. 35.82 కోట్లకు పైనే బకాయిలు
- ఈ నెల చివరిలోగా వడ్డీ, పెనాల్టీ లేని చెల్లింపులకు అవకాశం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అధికారుల నిర్లక్ష్యమో ఏమో కానీ నంద్యాల మున్సిపాలిటీకి రావాల్సిన పన్నులు వసూలు కావడం లేదు.. గత పదేళ్ల నుండి చూస్తే దాదాపు రూ.40 కోట్ల మేర ఆస్తి పన్నులు పేరుకుపోయాయి. షాపింగ్ కాంప్లెక్స్‌లు, పెద్ద పెద్ద భవంతులు, ఫ్యాక్టరీల నుండే ఎక్కువ శాతం పెండింగ్ ఉన్నాయి. ఇలా చుస్తే రాష్ట్రంలోని పెద్ద పెద్ద నగరాల్లో విజయవాడ, వైజాగ్, గుంటూరు, నెల్లూరు, తిరుపతిలో కోట్లలోనే బకాయిలు పెండింగ్ ఉన్నాయని అధికార వర్గాల నుండి స్పష్టమౌతుంది. వీటిని ఎలాగైనా రాబట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. రాష్టంలోని మున్సిపాలిటీలలో పేరుకపోయిన ఆస్తి పన్ను బకాయిలను వసూలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గాలను వెతుకుంతోంది. ఏళ్ల తరబడి కట్టని పన్నులను ఎలాగైనా వసూలు చేసి మున్సిపాలిటీల ఆదాయాన్ని పెంచేందుకు వన్ టైం సెటిల్‌మెంటుకు తెరలేపింది.. ఈ నెల మార్చి 31లోగా ఉన్న పన్నులు కడితే వడ్డీ, పెనాల్టీ కట్టనవసరం లేదని ప్రభుత్వం జీవో నెంబర్ 34ను ఈ నెల 16న తీసుకొచ్చింది. ఈ ప్రక్రియ వలన మున్సిపాలిటీకి పన్నులు వసూలు అవుతాయని అధికారులు భవిస్తున్నారు.

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో 2012 సంవత్సరం నుండి నేటి వరకు దాదాపు రూ.25.97 కోట్లు ఆస్తి పన్ను బకాయి ఉంది. ఇన్ని రోజులు పన్ను చెల్లించకపోవడంతో వాటికి పెనాల్టీ కింద రూ.9 కోట్ల 83 లక్షలు మొత్తం రూ.35.82 కోట్లు మున్సిపాలిటీకి ఆదాయం రావాల్సి ఉంది. ఇప్పటి వరకు నంద్యాల మున్సిపాలిటీకి పన్నుల ద్వారా రూ.16.92 కోట్లు వసూలు అయినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా రూ.10 కోట్ల 36 లక్షలు మున్సిపాలిటీకి రావాల్సి వుంది. ప్రభుత్వం ప్రకటించిన వన్ టైం సెటిల్‌మెంటు పద్దతిలో ఈ 5 రోజులలో మరో 4 కోట్ల రూపాయలు వసూలు అయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అంతా ఒకేసారి పెండింగ్‌లో ఉన్న బకాయిలు కడితే, పేరుకుపోయిన మొండి బకాయిలకు వడ్డీ, పెనాల్టీ రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో పన్నుదారుల్లో మంచి స్పందననే వచ్చింది.. చిన్న చిన్న మొత్తాల్లో ఉన్న వారు తమ ఆస్తి పన్ను బకాయిని చెల్లిస్తున్నారు. అయితే రూ 1.50 లక్షలు, ఆపైనా బకాయి ఉన్న వారు నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో వంద మంది పైగా ఉన్నట్లు మున్సిపల్ అధికారులే వెల్లడిస్తున్నారు. ఈ బకాయిలు కూడా పెద్ద పెద్ద కంపెనీల నుండి, ప్రభుత్వ భవనాల నుండి, పెద్ద పెద్ద కాంప్లెక్స్‌ల యజమానుల నుండి పెండింగ్ ఉన్నట్లు తెలుస్తుంది. వీరందరూ కట్టాల్సిన అసలు పన్ను, పెనాల్టీ కలిపితే దాదాపు రూ.3 కోట్ల పైన అవుతుంది. అయితే వన్ టైం సెటిల్ మెంట్ కింద వీరు బకాయిలు చెల్లిస్తే 50 శాతమే కట్టాల్సి ఉంటుంది.. ఈ పద్ధతిన మున్సిపాలిటీకి భారీగా నష్టం జరుగుతున్నప్పటికి, కట్టాల్సినది చెల్లిస్తే చాలు అదే మహా ప్రసాదంలా అధికారులు భావిస్తున్నారు. అసలు చెల్లించినా రావాల్సిన ప్రిన్సిపుల్స్ అమౌంట్ రూ.25.97 కోట్లు వసూలు అవుతుందనే నమ్మకంతో మున్సిపల్ అధికారులు ఉన్నారు. మరి ఈ ఐదు రోజుల్లో రూ.10 కోట్లు వసూలు అవుతుందా లేదా చూడాలి మరి..

ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల పట్టణంలోని ప్రజలు చెల్లించాల్సిన పన్నులు ఈ నెల చివరి లోపల చెల్లిస్తే వారి బకాయిల పైన వేసిన వడ్డీ, ఫెనాల్టీ రద్దు అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సౌకర్యర్థం కోసం వన్ టైమ్ సెటిల్‌మెంటు కింద కట్టేందుకు అవకాశం కల్పించింది. కాబట్టి పన్నులు చెల్లించని వారు, ఏళ్ల తరబడి పెండింగ్ ఉన్న బకాయిలను ఈ నెల చివరిలోగా చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి. ప్రభుత్వం కల్పించిన సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రాష్టంలోని 123 మున్సిపాలిటీలలో పన్నుల వసూళ్లలో నంద్యాల మున్సిపాలిటీ 5వ స్థానంలో ఉంది. ప్రజలు పన్నులు కట్టాలని 1500 లీగల్ నోటీసులు, మున్సిపాలిటీ నుండి 3 వేలకు పైగా నోటీసులు ఇచ్చాము.

- సి.రవిచంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్, నంద్యాల.

గ్రామీణ రోడ్లకు రూ.69 కోట్లు

- సచివాలయాల నిర్మాణాలు వేగవంతం
- జగనన్న కాలనీలకు ముఖ ద్వారాలు
- ప్రజాశక్తితో పంచాయతీ రాజ్ ఎస్ఇ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

"జిల్లాలో చాలా గ్రామాలకు రహదారులు సరిగా లేవు. చాలా ప్రమాదకరంగా ఉన్న గ్రామాల రహదారులు గుర్తించి రహదారులు వేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. సచివాలయాల నిర్మాణాలు వేగవంతం చేస్తున్నాం. మరింత అభివృద్ధిని చేయడానికి తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నాం. గ్రామీణ రోడ్ల నిర్మాణానికి రూ.69 కోట్ల మేర మంజూరు జరిగింది. తక్షణమే నిర్మాణాలు చేసేలా చర్యలు తీసుకుంటాం" అని పంచాయతీ రాజ్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

ప్రస్తుతం రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వాటికి ఏం చర్యలు తీసుకున్నారు?

ఎస్ఇ : జిల్లాలో 6 మండలాల్లోని గ్రామాల్లో, మండల కేంద్రాల్లో రహదారులు పూర్తి అధ్వానంగా ఉన్న వాటిని గుర్తించాం. దాదాపు వాటి నిర్మాణాలు అన్నీ పూర్తి దశలో ఉన్నాయి. అదనంగా 11 రహదారులను గుర్తించాం వాటికి మంజూరుకు పంపించాం. రూ.69 కోట్లు మంజూరు జరిగింది. త్వరలో వీటి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

సచివాలయాల నిర్మాణాలు ఎలాంటి దశలో ఉన్నాయి ? సమస్యలు ఏమైనా ఉన్నాయా?

ఎస్ఇ : కర్నూలు జిల్లా మొత్తం 458 సచివాలయాలు ఉన్నాయి. అందులో ఆదోని డివిజన్‌లో 276 మంజూరు అయ్యాయి. ఇందులో పూర్తి అయినవి 71, ఫినిషింగ్ దశలో 37, సెకెండ్ స్లాబ్ 31, మొదటి స్లాబ్ 38, రూఫ్ లెవల్ 39, బేసిమెంట్ లెవల్ 45 , బేసిమెంట్ ముందు 13 ఇంకా మొదలు కానివి 2 ఉన్నాయి. కర్నూలు డివిజన్‌లో 182 మంజూరు కాగా 65 పూర్తి అయ్యాయి. 55 ఫినిషింగ్ దశలో, సెకెండ్ స్లాబ్ లో 20, మొదటి స్లాబ్‌లో 9, రూఫ్ లెవల్‌లో 21, బేస్మెంట్ 10, బేస్మెంట్ కంటే తక్కువ దశలో 1 ఉన్నాయి. వీటిని కూడా వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఇంకా ఏయే నిర్మాణాలు జరుగుతున్నాయి?

ఎస్ఇ: రైతు భరోసా కేంద్రాలు 447కు గాను 80 పూర్తి అయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. హెల్త్ సెంటర్స్ 354కు గాను 29 పూర్తిగా నిర్మాణాలు అయ్యాయి. మిగతా భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. కోల్డ్ స్టోరేజ్‌లు మొత్తం 64 కాగా 2 పూర్తి అయ్యాయి. మిగతావి నిర్మాణ దశల్లో ఉన్నాయి. వైఎస్సార్ డిజిటల్ లైబ్రెరీలు 149 గాను ఇంకా ఎక్కడ పూర్తికాలేదు. ఇవన్నీ వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

రాష్ట్ర ప్రభుత్వం నుంచి కాకుండా ఇంకా ఏమైనా రహదారుల నిర్మాణాలు మంజూరు అయ్యాయా?

ఎస్ఇ : ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద జిల్లాకు రూ.19 కోట్లు మంజూరు అయ్యాయి. గూడూరు, కోడుమూరు మీదుగా వయ చనుగొండ్ల రోడ్, గార్గేయపురం నుండి పసుపల వయ శివరామపురం రుద్రవరం దాకా, నంద్యాల పార్లమెంట్ పరిధిలో ఉలిందకొండ నుండి కోడుమురు, వెల్దుర్తి వయ కొంగణపాడు వరకు.,అలాగే హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం ఉలిందకొండ నుండి కోడుమూరు వెల్దుర్తి వెళ్లే దారిలో నిర్మాణాలకు కలిపి రూ.19 కోట్లు మంజూరు అయ్యాయి.

జగనన్న కాలనీ ముఖద్వారాల పనులు ఎలా చేస్తారు?

ఎస్ఇ : జిల్లాలో జగనన్న కాలనీల్లో ముఖ ద్వారాలకు 40 కాలనీలకు ఏర్పాటుకు మంజూరు జరిగింది. ఒకొక్క ముఖద్వారానికి రూ.4.15 లక్షలు మంజూరయ్యాయి. నామినేటెడ్ కింద ఈ పనులు చేస్తారు. ఇంకా మొదలు కాలేదు. జూలై నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

మీ కుటుంబ నేపథ్యం, మీ విద్యాభ్యాసం గురించి?

ఎస్ఇ : మాది చిత్తూరు జిల్లా పీలేరు మండలం గుండ్రేవారి పల్లె. తండ్రి వెంకటస్వామి, తల్లి జయమ్మ. భార్య స్వరూప లక్ష్మీ ఎపిజిఎల్‌ఐలో సూపరింటెండెంట్‌గా రిటైర్డ్ అయింది. ముగ్గురు అమ్మాయిలు సంతానం. అందరికి వివాహాలు అయ్యాయి. బాల్యంలో ఊరిలోనే 5 వరకు చదివాను. 5 నుండి మా ఊరి పక్కన బిజినేపల్లిలో 10 వరకు చదివా.పీలేరులో ఇంటర్, బిటెక్ జేఎన్టీయూలో పూర్తి చేశాను. 10వ తరగతిలో మండలంలో ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను. మొదటి ర్యాంక్ సాధించాను. అలా విద్యాభ్యాసం పూర్తి చేశాను.

ఉద్యోగ ప్రస్థానం ఎలా ఎక్కడ నుండి మొదలయింది?

ఎస్ఇ : 1987లో సర్వీస్ కమిషన్ ద్వారా మొట్టమొదటి సారి గుత్తిలో ఏఈఈగా జాయిన్ ఆయన. అక్కడ నుండి కర్నూలులో మిడ్తూర్, కల్లూరు మండలాల్లో చేశాను, 1994లో డిఈగా ప్రమోషన్‌తో ఎమ్మిగనూరుకు బదిలీ అయ్యాను. ఆలూరు, కోవెలకుంట్లలో ఆర్‌డబ్ల్యూఎస్ డిఇగా కర్నూలులో, నందికొట్కూరులో చేశాను. 2009లో ఇఇగా ప్రమోషన్‌తో మహబూబ్ నగర్‌కు అసిస్టెంట్ డైరెక్టర్ డ్వామాగా చేశాను. అక్కడ నుండి బదిలీపై కర్నూలులో ఎస్ఎస్ఏలో ఇఇగా మొదటిసారి నా నుండి మొదలు అయింది. ఆ తరువాత అదోనిలోకి బదిలీ ఆయ్యాను. 2013 నుండి 2019 దాకా చేశాను. 2019లో ఎస్ఈగా ప్రమోషన్‌తో కోస్తాంధ్ర లో చేశాను. 2020లో కర్నూలు పంచాయితీ రాజ్ ఎస్ఇగా వచ్చాను.

మీ సర్వీస్ లో బాగా గుర్తు ఉండే పనులు, అవార్డులు ఏమైనా ఉన్నాయా?

ఎస్ఇ : కోడుమూరు దగ్గర తిప్పనూర్ బ్రిడ్జి ఛాలెంజ్ గా చేశాము. దేవనగర్ నుండి కల్లూరు వెళ్లే బ్రిడ్జి బాగా చేశాము. ఎస్ఎస్ఏలో ఉండగా బాగా చేసాను. ఆ తరువాత అదోనిలో చాలా పనులు నిర్మాణం చేశాము. రెండు సార్లు కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవలకు అవార్డులు

రంజాన్ వేళలు

సోమవారం
ఇఫ్తార్ : 6 : 35

మంగళవారం
సహేరి : 4 : 54

నేడు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి రాక

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని పార్నపల్లి గ్రామానికి నేడు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి రానున్నట్లు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దేరెడి చిన్న సంజీవరెడ్డి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నేడు పార్నపల్లిలోని టిటిడి కల్యాణ మండపంలో జరిగే వైయస్సార్ ఆసరా పథకం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని చెప్పారు. మండలంలోని వైసిపి నాయకులు, అధికారులు, డ్వాక్రా మహిళలు, అక్క చెల్లెమ్మలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - పగిద్యాల

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు గడువు పొడిగించినట్లు లక్ష్మాపురం అంచ సమీపాన ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ వెంకట రమణమ్మ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశం దరఖాస్తుకు ఈ నెల 31 వరకు పొడిగించినట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట వేడుకలు

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలోని గడ్డమేకలపల్లె గ్రామంలో సీతారాముల ఆలయ ప్రతిష్ట వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తిరుమల తిరుపతి దేవస్థానంకు చెందిన శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు పది లక్షల రూపాయలతో నిర్మించిన ఆలయంలో గత మూడు రోజుల నుండి వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నేడు సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలను, ధ్వజస్తంభం ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బనగానపల్లె శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి, వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్రెడ్డి, కాటసాని ప్రసాద్ రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలందరూ ఐకమత్యంగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, పాల్గొన్నారు.

మోడీ విధానాలను ప్రతిఘటిద్దాం

- ఏప్రిల్ 5న చలో ఢిల్లీకి తరలిరండి : ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

దేశ సంపదను, ప్రకృతి వనరులను, ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ కార్మిక కర్షక కష్టజీవుల మీద భారాలు మోపుతున్న మోడీ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటిస్తూ ఏప్రిల్ 5న జరుగుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం మండల అధ్యక్షులు మాబాష, కార్యదర్శి వీరన్న, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నరసింహ నాయక్, ఎన్. స్వాములు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిఐటియు జిల్లా నాయకులు ఏ.రణధీర్‌లు కోరారు. ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలలో చలో ఢిల్లీని జయప్రదం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వామపక్షాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు దశాబ్దాలుగా చేసిన పోరాటాల ఫలితంగా యూపీఏ ప్రభుత్వ హయాంలో వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని మోడీ ప్రభుత్వం నిధులు తగ్గించి నిర్వీర్యం చేస్తుందని తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 33 శాతం నిధులు తగ్గించిందని అన్నారు. ఫలితంగా ఉపాధి పని చేసినా వేతనాలు రాక కూలీలు పనులకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని చెప్పారు. కూలీలు పనులకు రావడం లేదనే కారణంతో ఉపాధి చట్టాన్ని కనుమరుగు చేయాలని మోడీ ప్రభుత్వం కుట్ర పన్నిందని విమర్శించారు. కనీస మద్దతు ధరలు చట్ట సాధన కోసం, వ్యవసాయ రంగాన్ని సంక్షోభం నుండి కాపాడాలని కోరుతూ ఏడాది పాటు ఢిల్లీ నడిబొడ్డున రైతాంగం చేసిన ఉద్యమం సందర్భంగా వారికి ఇచ్చిన హామీలన్నీ మోడీ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. కార్మిక వర్గం అనేక పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం కుదించి నాలుగు చట్టాలుగా మార్చిందని అన్నారు. దేశంలో ఉన్న ప్రకృతి వనరులన్నీ ఆదానికి అప్పగించారని, ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఈ విధానాలను ప్రతిఘటిస్తూ కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ ర్యాలీ ఏప్రిల్ 5న ఢిల్లీలో లక్షలాది మందితో జరుగుతుందని తెలిపారు. ఈ ఉద్యమంలో కార్మిక కర్షక కష్టజీవులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు హరి, కృష్ణ, పఠాన్ యూసుఫ్, ఖాజా, నర్సయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు ప్రత్యేక దృష్టి

- నాటు సారా, అక్రమ మద్యంపై నిఘా పెట్టాలి
- జిల్లా ఎస్‌పి రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - పాములపాడు

మహిళల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, నాటుసారా, అక్రమ మద్యం రవాణాపై నిఘా పెట్టాలని జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి పోలీసులకు సూచించారు. ఆదివారం పాములపాడు పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్‌పి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ స్టేషన్‌కు సంబంధించిన రికార్డులు సరిగా ఉంచుకోవాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదిదారుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని, చట్ట పరిధిలో సత్వర న్యాయం జరిగేలా చూడాలన్నారు. పెండింగ్ కేసులు లేకుండా పని చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. మహిళల రక్షణకు నూతనంగా ప్రవేశపెట్టిన దిశ యాప్ పట్ల మహిళల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. పిడిఎస్ రైస్, గుట్కా, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. నాటు సారా, అక్రమ మద్యంపై ప్రత్యే నిఘా ఉంచి పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో వివిధ రకాల కేసులలో పట్టుబడిన వాహనాలను పరిశీలించి వాటిని త్వరగా సంబంధిత అధికారుల అనుమతి తీసుకుని డిస్పోజల్ చేయాలని తెలిపారు. ప్రజలతో పోలీసులు మైత్రి భావం పెంపొందే విధంగా నడుచుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై గ్రామాల్లో మహిళా పోలీసులు వాలంటీర్స్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో పాములపాడు ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి

లాయర్ల అసోసియేషన్ సంఘం అధ్యక్షుడిగా రమణయ్య

- సంఘానికి అండగా ఉంటాం : మాజీ మంత్రి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డలో నూతనంగా ఏర్పాటు చేసిన లాయర్ల అసోసియేషన్ సంఘం అధ్యక్షుడిగా ఎస్.రమణయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా లాయర్ల అసోసియేషన్ సంఘం సభ్యులు మాజీ మంత్రి భూమా అఖిలప్రియను ఆదివారం ఆమె స్వగృహంలో మర్యాదపూర్వంగా కలిశారు. ఆళ్లగడ్డలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యాయవాదుల అసోసియేషన్ కు అన్ని విధాలుగా అండగా ఉంటానని, పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ హామీ ఇచ్చారు. లాయర్ల నూతన అసోసియేషన్ సంఘం అధ్యక్షులుగా ఎస్. రమణయ్య, ఉపాధ్యక్షులుగా జి మురళీధర్, జనరల్ సెక్రెటరీగా శివప్రసాద్ రావు, ట్రెజరర్‌గా తిరుపాల్ రెడ్డి, జనరల్ సెక్రెటరీలుగా ఖాజా హుస్సేన్, సుబ్బయ్య, మోహన్, మహిళా న్యాయవాదులుగా చందన, లత, నాగమణి, సభ్యులుగా ఓబులేసు, నరసయ్య, రఘునాథ రెడ్డి, హృషికేశ్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, హరి గోపాల్, సుదర్శన్, డిసి విజయ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రశాంతి నిరాశ్రయుల వసతి గృహంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆళ్లగడ్డ అడ్వకేట్ అసోసియేషన్ వారు మాట్లాడుతూ న్యాయవాదులు కక్షిదారులకు న్యాయం చేయడమే కాకుండా ఇలాంటి సామాజిక సేవ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడం తగదు : ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - ప్యాపిలి : మండలంలోని జలదుర్గం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం పెట్టనివ్వకుండా అధికారులు అడ్డుకోవడం తగదని ఎమ్మార్పీఎస్ డోన్ గౌరవాధ్యక్షులు చంద్రమోహన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గతంలో పంచాయతీ అధికారులు ఊర్లో ఉన్న ఒక ఖాళీ స్థలంలో అంబేద్కర్ విగ్రహం పెట్టించడానికి గ్రామ పంచాయితీ సర్పంచి, సెక్రెటరీ, గ్రామ ప్రజలు, తహశీల్దార్ పర్మిషన్ ఇచ్చారని చెప్పారు. తాము భూమిపూజ కార్యక్రమం పూర్తి చేసి పనులు మొదలుపెట్టే సమయంలో తహశీల్దార్ ఇంకా మిగతా అధికారులు కలిసి విగ్రహం పెట్టనివ్వకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. నెలల నుంచి ఆఫీసుల చుట్టూ తిప్పుకుంటున్నారని తెలిపారు. అధికారులు ఇలాగే వ్యవహరిస్తే దళిత సంఘాలు ఏకమై తహసీల్దార్ ఆఫీసు, కలెక్టర్ ఆఫీసు దగ్గర నిరాహార దీక్ష చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

పేదలకు ఉచిత వైద్యమందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - సంజామల : పేదలకు ఉచితంగా వైద్యం అందించడమే లక్ష్యమని, అందుకే ప్రతి నెలా చివరి ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఉచిత వైద్య శిబిరం చైర్మన్ దస్తగిరి రెడ్డి తెలిపారు. ఆదివారం సంజామలలో వెయ్యి మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వివిధ రకాల వ్యాధులకు సంబంధిత డాక్టర్లు వైద్యం సేవలు అందించారని తెలిపారు.

నిరుపేద వృద్ధులను ఆదరించాలి

ప్రజాశక్తి-డోన్ : సమాజంలో ఉన్న నిరుపేద వృద్ధులను ఆదరించాలని చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు రామానాయుడు అన్నారు. పట్టణంలోని తారకరామ నగర్‌కు చెందిన ఒంటరి వృద్ధురాలు నారాయణమ్మ అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతూ జీవనం సాగిస్తుందనే విషయం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ దృష్టికి రాగా సభ్యులందరి సహకారంతో రూ. 7 వేలు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తుందని తెలిపారు. పలు సేవలకు సంస్థ సభ్యుల, దాతల సహకారం గొప్పదన్నారు. అనంతరం వృద్ధురాలు నారాయణమ్మ సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రెజరర్ మీసేవ శీను, జనరల్ సెక్రటరీ రవికుమార్, సభ్యులు అశోక్, గుర్రం మధు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి 7వేల రూపాయలను అందిస్తున్న చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

గొడవ పడుతున్న ఇరు గ్రూపుల వారు

రాళ్లు, కట్టెలతో ఇరు గ్రూపులు దాడి

ప్రజాశక్తి - బేతంచర్ల

మండలంలోని నాగమల్లకుంట గ్రామం దగ్గర పొలం విషయంలో ఒకరినొకరు సినిమాలో సీన్లను తలపించేలా రాళ్లతో, కట్టలతో దాడి చేసుకున్న ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని నాగమల్లకుంట గ్రామం వద్ద సర్వే నంబరు 1037/1లో 5 ఎకరాలు, 1037/2 లో 3.96 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన కోటిపల్లి గ్రామానికి చెందిన నాయిని రామకృష్ణకు డోన్ సివిల్ కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. దీంతో ఆదివారం రామకృష్ణ అతని మిత్రులు సంబంధిత భూమి దగ్గరకు ఇంజక్షన్ ఆర్డర్‌తో బోర్డును ఏర్పాటు చేయడానికి వెళ్లారు. బోర్డు ఏర్పాటు చేస్తున్న సమయంలో అంతకుముందే ఆ పొలం వద్ద ఉన్న ప్రత్యర్థులు రామకృష్ణ, అతని అనుచరులపై దాడి చేశారు. అనంతరం ఇరువురు ఒకరొకరు రాళ్లతో, కట్టెలతో దాడి చేసుకున్నారు. గాయపడిన వారు బేతంచర్ల పోలీస్ స్టేషన్‌కు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కనపించని చలివేంద్రాలు.. చలువ పందిళ్లు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలో ఈ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలి వేంద్రాలు, చలువ పందిళ్ళు ఎక్కడ చూసినా జాడ కనపడటం లేదు. ఎండలు మండుతున్నాయి. ఎండ వేడిమికి ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. కానీ అధికారులు మాత్రం ఉపశమన చర్యలు తీసుకోవడంలో దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.. అధిక ఉష్ణోగ్రత వల్ల ఎండ వేడిమి పెరుగుతుండడంతో వాటిని తట్టుకోవడానికి జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా ప్రత్యేక కూడళ్లలో చలువ పందిళ్ళు ఏర్పాటు చేయడంతోపాటు, చలివేంద్రాలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించాల్సి వుంది. కానీ అధికారులు మాత్రం ఆ వైపు దృష్టి సారించడం లేదని పట్టణ ప్రజలు చర్చించుకోవడం కొసమెరుపు.. ఎండల తీవ్రత తగ్గాక అధికారులు అప్పుడు స్పందించి హడావిడి చేస్తారనే విమర్శలను మూట కట్టుకుంటున్నారు. మార్చి మొదటి వారం నుండి ఉష్ణోగ్రతల తీవ్రత పెరిగి ఎండ వేడిమితో అల్లాడుతున్నారు. వడదెబ్బ తగలకుండా ఉండాలంటే అధికారులు తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు, జాగ్రత్తలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుకుంటున్నారు.

రజకులను ఎస్‌సి జాబితాలో కలపాల్సిందే

- రజక విద్యార్థి, యువజన సంఘం డిమాండ్

ప్రజాశక్తి - సిరివెళ్ల

రజకులను ఎస్‌సి జాబితాలో కలపాలని, ఎస్సీ ఎస్టీ తరహాలో ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని రజక విద్యార్థి, యువజన, సంఘం (ఆర్‌ఎస్‌వైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డి చిన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రజకులకు ఎటువంటిరకంగా ఉపయోగపడకపోగా, రజకులు అవమానాలు ఎదుర్కోవాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులను ఎస్‌సి జాబితాలో కలపాలని, లేనిపక్షంలో రజక ఉద్యమం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఘనంగా చౌడేశ్వరి దేవి జ్యోతి మహోత్సవం

- 650 జ్యోతుల ఊరేగింపు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం అర్ధరాత్రి ప్రారంభమైన జ్యోతి ఉత్సవం ఆదివారం ఉదయం జ్యోతులన్నీ అమ్మవారి సన్నిధికి చేరుకోవడంతో జ్యోతి మహోత్సవం ముగిసింది. ఆలయ ఇఒ రామానుజన్ ఆధ్వర్యంలో జ్యోతి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున విశ్వబ్రాహ్మణ భాస్కరయ్య అమ్మవారికి దృష్టి చుక్క పెట్టి జ్యోతి ఉత్సవాలకు అంకు రార్పణ చేశారు. గ్రామంలోని జ్యోతి మండపం వద్దకు వెళ్లి పూజలు నిర్వహించి జ్యోతి ఉత్సవాన్ని ప్రారంభించారు. నందవరిక బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో 170 జ్యోతులు, మహారాష్ట్ర సోలాపూర్ చెందిన వారు 150 జ్యోతులు, గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన వారు 70 జ్యోతులు మొత్తం 650 జ్యోతులు వివిధ రకాలుగా తయారు చేసి నృత్యం చేస్తూ భక్తిగీతాలు ఆలాపిస్తూ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. తెల్లవారుజామున 2 నుంచి ఉదయం 8 గంటల వరకూ జ్యోతి ఉత్సవం కొనసాగింది. భక్తులు అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో దిగి ఆపై జ్యోతితో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పూజలు, గర్భాలయ ప్రవేశాన్ని తాత్కాలికంగా రద్దు చేసి కేవలం అమ్మవారి దర్శనాన్ని మాత్రమే కల్పించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వసతులు, క్యూలైన్లను ఏర్పాటు చేశారు. జ్యోతి ఉత్సవంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా బనగానపల్లె సిఐ సుబ్బ రాయుడు, నందివర్గం, బనగానపల్లె ఎస్సైలు రామాంజనేయ రెడ్డి, రామిరెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బనగానపల్లె ఆర్టీసీ డిపో వారు ప్రత్యేక బస్సులను నడిపారు. జ్యోతి మహోత్సవాలను తిలకించేందుకు రాష్ట్ర నలు మూలల నుండే గాక మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలిచ్చారు.

అంగరంగ వైభవంగా రథోత్సవం

చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు ఆదివారం సాయంత్రం అమ్మవారి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తిని రథంలో ఆశీనులు చేసి గ్రామ పురవీధుల గుండా రథోత్సవాన్ని నిర్వహించారు. వేలాది భక్తులు పాల్గొన్నారు.

జ్యోతులతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

అన్నదానం చేస్తున్న దృశ్యం

బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పూజలు

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి జ్యోతి మహోత్సవంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డిలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేకు చౌడేశ్వరి దేవి దేవస్థానం మాజీ చైర్మన్ పిఆర్ వెంకటేశ్వర రెడ్డి, కెడిసిసి జిల్లా డైరెక్టర్ పి.ఆర్ మురళీమోహన్ రెడ్డి, వైసిపి నాయకులు తులసి రెడ్డి, నాగరాజు, పిబి గణేష్ యాదవ్‌ల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నాయకుల ఇండ్లలో ఆతిథ్యాన్ని స్వీకరించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి, ఆయన సతీమణి బిసి ఇందిరాలకు టిడిపి మండల అధ్యక్షులు పివి కుమార్ రెడ్డి, నాయకులు సూర్యనారాయణ రెడ్డిల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే దంపతులు, టిడిపి యువ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డిలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాయకుల ఇండ్లలో ఆదిథ్యం స్వీకరించారు.

50 పడకల నూతన వైద్యశాల భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

వైద్యశాలను ప్రారంభిస్తున్న విప్, ఎమ్మెల్యే

ఆళ్లగడ్డ పట్టణంలో రూ. 3 కోట్ల నాబార్డు నిధులతో నూతనంగా నిర్మించిన 50 పడకల నూతన ప్రభుత్వ వైద్యశాల భవనాన్ని శాసనమండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, శాసనసభ్యులు గంగుల బిజేంద్ర రెడ్డిలు నంద్యాల ఎంపీ పోచ బ్రహ్మానందరెడ్డి, విజయ మిల్క్ డైరీ చైర్మన్ ఎస్వీ జగన్ మోహన్ రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనమండలి విప్ మాట్లాడుతూ నూతన వైద్యశాల భవనంలో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 2022 అక్టోబర్‌లో సిఎం జగన్మోహన్ రెడ్డి ఆళ్లగడ్డకు వచ్చిన సందర్భంగా ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాల నూతన భవనంలో నూతన సదుపాయాల కోసం రూ. 8 కోట్లు మంజూరు చేశారన్నారు. త్వరలోనే మరిన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో డాక్టర్ల బృందం, వైద్య సిబ్బంది చక్కగా పని చేస్తున్నారని కితాబు ఇచ్చారు. ప్రభుత్వ వైద్యశాలలో పూర్తి వసతులు ఉండాలన్న ఆలోచనతోనే ఇక్కడ ఉన్న సబ్ రిజిస్టార్ కార్యాలయాన్ని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలోకి తరలించినట్లు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆళ్లగడ్డ వాసుల కల నేటితో ఫలించిందన్నారు. సకల సౌకర్యాలతో 50 పడకల నూతన ప్రభుత్వ వైద్యశాల భవనాన్ని తీర్చిదిద్దామన్నారు. పాత వైద్యశాల నుండి కొత్త వైద్యశాలకు వెళ్లేందుకు కనెక్టివిటీ రోడ్డును ఏర్పాటు చేయడం కోసం ఎంపీ 25 లక్షల రూపాయల ఎంపీ నిధులను మంజూరు చేశారన్నారు. అంతకుముందు పట్టణంలో రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన సిసి రోడ్లు, డ్రైనేజీలను విప్, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో నంద్యాల డిసిహెచ్ ఇంచార్జ్ డాక్టర్ జఫరుల్లా, తాసిల్దార్ హరినాథ్ రావు, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, ఎన్జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి రెడ్డి, డిఈ నాగేశ్వరరావు యాదవ్, ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవ రెడ్డి, ఆళ్లగడ్డ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రామలింగా రెడ్డి, వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, కౌన్సిలర్ గొట్లురు సుధాకర్ రెడ్డి, గోపవరం నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూతురు పుట్టిన రోజు సందర్భంగా వద్ధాశ్రమ నిర్వాహకులకు 5 వేల రూపాయల నగదును అందిస్తున్న ప్రశాంత్, వరలక్ష్మి దంపతులు

వృద్ధాశ్రమంలోని వృద్ధులను ఆదరించాలి

ప్రజాశక్తి-డోన్

వృద్ధాశ్రమంలో ఉండే వృద్ధులను ఆదరించాలని హెూసన్నా వృద్ధాశ్రమ నిర్వాహకులు జానప్రభాకర్ పేర్కొన్నారు. జూపాడుబంగ్లా గ్రామానికి చెందిన ప్రశాంత్, వరలక్ష్మి దంపతులు కూతురు స్వీటీ మొదటి పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు చికెన్ బిర్యాని, రూ. 5 వేలు ఆశ్రమానికి అందజేశారు. ఈ సందర్భంగా జాన ప్రభాకర్ మాట్లాడుతూ ఏ కుటుంబంలో అయినా మొదటి బర్త్ డే బంధువులు మిత్రులతో సంతోషంగా జరుపుకుంటారని, అలా కాకుండా ఆశ్రమంలో ఉండే వృద్ధుల మధ్య జరుపుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో సలోమి, అరుణ్, పరిమళ, శీలన్న, ఆశ్రమ సూపర్వైజర్ భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్ అకాడమీ క్రీడాకారుల స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని ఎద్దుల పాపమ్మ పాఠశాల క్రీడా మైదానంలో సోముల రమణారెడ్డి ఆర్‌ఆర్ అకాడమీ క్రీడాకారులు చెత్తను తీసివేసి క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ఆదివారం స్వచ్ఛందంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ క్రీడాకారులు సదా వెంకట కుమార్, పిఈటి హరి, కోచ్ సుబ్బారాయుడులు మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడాకారులలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని అలవాటు చేయడం వలన భవిష్యత్తులో వారు కూడా ఇటువంటి కార్యక్రమాలలో పాల్గొంటారని, భావితరాలకు ఆదర్శంగా నిలుస్తారన్నారు.

రాష్ట్ర స్థాయి రాతిదూలం పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి రాతి దూలం పోటీలను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంబరాల్లో భాగంగా ఒంగోలు జాతి వృషభాల రాష్ట్రస్థాయి దూలం పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.80 వేలు, రెండవ బహుమతి రూ.60 వేలు, మూడో బహుమతి రూ.50 వేలు, నాలుగవ బహుమతి రూ.40 వేలు, ఐదవ బహుమతి రూ.30 వేలు, ఆరోవ బహుమతి రూ.20 వేలు, ఏడోవ బహుమతి రూ.15 వేలు, ఎనిమిదవ బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నందవరం చౌడేశ్వరి దేవస్థానం మాజీ చైర్మన్ పి.ఆర్ వెంకటేశ్వర రెడ్డి, వైసిపి నాయకులు జిల్లెల్ల శంకర్ రెడ్డి, తిమ్మాపురం సురేష్ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పసుపల జనార్దన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

రాతి దూలం పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సంగమేశ్వరాలయాన్ని దర్శించుకున్న ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్ఎస్) చీఫ్ మోహన్ భగవత్ ఆదివారం కొత్తపల్లి మండలంలోని సంగమేశ్వరం క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఆయన హైదరాబాద్ నుంచి కర్నూలుకు చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేక కాన్వాయ్‌లో సంగమేశ్వరానికి చేరుకున్నారు. అక్కడ సప్తనదుల సంగమ ప్రదేశంలో పుణ్యస్నానం ఆచరించి ఆ తర్వాత గర్భాలయంలోని వేపదారు శివలింగాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తిరుగు ప్రయాణంలో కొత్తపల్లి మండలంలోని ప్రముఖ వ్యాపారవేత్త, విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు దివంగత జి.పుల్లారెడ్డి స్వగ్రామం గోకవరంలో ఆర్‌ఎస్ఎస్ సహకారంతో నిర్వహిస్తున్న భక్త కన్నప్ప చెంచు గురుకుల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు.

విద్యార్థులు పరీక్షల్లో రాణించాలి

ప్రజాశక్తి - డోన్

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఆర్‌టిసి ఆర్‌ఎ శాంతి అన్నారు. ఆదివారం డోన్ పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినులకు డాక్టర్ ఎస్‌ఎస్ గాజల్ ఆర్థిక సౌజన్యంతో 70 మందికి అట్టలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడితే చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా డాక్టర్ ఎస్‌ఎస్ గాజల్ విద్యార్థులకు అవసరమయ్యే వస్తువులు అందించడం ఎంతో అభినందనియమన్నారు. అనంతరం ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎస్‌ఎస్ గాజల్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు శైలజారెడ్డి, హాస్టల్ వార్డెన్ లక్ష్మీబాయ్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

నాడు-నేడుతో పాఠశాలలకు మహర్దశ

ప్రజాశక్తి - బేతంచర్ల

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చిందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, జడ్పీటీసీ శివలక్ష్మి అన్నారు. ఆదివాంర మండలంలోని హెచ్.కొట్టాల గ్రామంలో రూ.1.51 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలో ఇన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నా గిట్టని వారు ఓర్వలేక అభివృద్ధి జరగడం లేదని విమర్శించడం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు బాబుల్ రెడ్డి, తిరుమలేశ్వర్ రెడ్డి, కుమార్ రెడ్డి, గ్రామ సర్పంచ్ తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

యాత్రికుల వసతి భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ

ప్రజాశక్తి - మహానంది

మహానందీశ్వర స్వామి దేవస్థానంలో టిటిడి దేవస్థానం వారి రూ. 4 కోట్ల 60 లక్షల నిధులతో నూతనంగా నిర్మించతలపెట్టిన యాత్రికుల వసతి భవనానికి దేవస్థానం కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ మహేశ్వర్ రెడ్డిల ఆధ్వర్యంలో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ. 4 కోట్ల 60 లక్షల టిటిడి నిధులలో మొదటి దశ రూ.1 కోటి 60 లక్షలు పనులను ప్రారంభించడానికి భూమి పూజ చేశామన్నారు. ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి వచ్చిన తర్వాత 60 లక్షలుగా ఉన్న డిపాజిట్లు 8 కోట్ల ఎనిమిది లక్షల రూపాయలుగా ఉన్నాయని చెప్పారు. మహానంది క్షేత్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. రూ. 80 లక్షలతో కోనేరుల మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. ఇవేకాక దేవస్థానం తరఫున దాతలు ముందుకు వస్తే ఒక్కొక్క సూట్ రూమ్ 15 లక్షల రూపాయలు, డబుల్ బెడ్ రూమ్ 10 లక్షల రూపాయలుగా చెల్లిస్తే వారి పేరు మీదుగా రూములు నాగనంది సదనం పక్కన నిర్మించనున్నట్లు చెప్పారు. ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చక్రపాణి రెడ్డి సొంత నిధులతో నంది సర్కిల్, ల్యాండ్ స్కేపింగ్ పనులు చేయిస్తున్నారని, త్వరలో ఆ పనులు పూర్తి అవుతాయని తెలిపారు. పనులు పూర్తయిన అనంతరం మహానంది ఎంతో సుందరంగా ఉంటుందని, క్షేత్ర అభివృద్ధికి అందరి తోడ్పాటు అవసరమన్నారు. కార్యక్రమంలో వైసిపి శ్రీశైలం నియోజకవర్గం సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, టిటిడి దేవస్థానం అధికారులు, వైసిపి మహానంది మండల నాయకులు, మహానంది ఆలయ పాలక మండలి సభ్యులు, కార్యకర్తలు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

సకాలంలో పన్నులు చెల్లించండి : ఇఒపిఆర్‌డి

ప్రజాశక్తి - శిరివెళ్ల

మండల పరిధిలోని అయా గ్రామాలలో గృహ, వ్యాపార ఇతర యజమానులు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామపంచాయతీల రెవెన్యూ ఆదాయానికి సహకరించాలని ఇఒఆర్‌డి సాల్మన్ రాజ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని ఎర్రగుంట్ల, శిరివెళ్ల, గోవిందపల్లె గ్రామాలలో వసూలు చేసిన హౌస్ టాక్స్‌ల వివరాలను వయా గ్రామ పంచాయతీల బిల్ కలెక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మార్చి నెలలో పన్నుల వసూలు వేగవంతంగా చేసి వంద శాతం చేసేందుకు కృషి చేయాలని ఆయా గ్రామ పంచాయతీ ఈఓలు వెంకటేశ్వర్లు, మనోహర్, సీనియర్ అసిస్టెంట్ సుబ్రమణ్యంలకు ఇఒపిఆర్‌డి సూచించారు.

విరాళాన్ని అందజేస్తున్న దాతలు

శ్రీశైలం దేవస్థానానికి విరాళాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం దేవస్థానానికి ఆదివారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. గుంటూరుకు చెందిన కోటపాటి నరేష్ గో సంరక్షణ పథకానికి రూ. 1,01,116, అన్నదాన పథకానికి తెలంగాణ సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన వెలగల సుశాంక రూ.1,00,001, గుంటూరుకు చెందిన విజయలక్ష్మి రూ. 1,01, 116 విరాళంగా అందజేశారు. దాతలకు శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు మోడల్ విద్యార్థులు

ప్రజాశక్తి - పగిడ్యాల

నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు పగిడ్యాల మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుజన ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 8వ తరగతి చదువుతున్న ఎ.ప్రపాల్, చరణ్‌లు పోటీ పరీక్షల్లో పాల్గొని ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను ఆమె అభినందించారు.

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ జీవన్ గంగనాథ్ బాబు హెచ్చరించారు. ఆదివారం పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీలు, సస్పెకుట్స్‌లను పిలిపించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సైలు తిమ్మయ్య, వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూర్

మండలంలోని ముష్టేపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన మారెమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఆదివారం శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వేద పండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు రాజమోహన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజగోపాల్, ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్లు విజయ చౌదరి, సుల్తాన్ రెహమాన్, రవి నాయక్, గ్రామ సర్పంచ్, సీనియర్ నాయకులు ఈశ్వర రావు, రవి నాయక్, నాగేశ్వర్ రెడ్డి, లక్ష్మిరెడ్డి, పుల్లారెడ్డి, రమేష్ చౌదరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శిల్పాకు స్వాగతం పలుకుతున్న గ్రామ ప్రజలు

రాష్ట్ర అభివృద్ధే వైసిపి ధ్యేయం

- ఎమ్మెల్సీ, ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

రాష్ట్ర అభివృద్ధే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిలు తెలిపారు. ఆదివారం ఉయ్యాలవాడ మండలంలోని పుచ్చకాయలపల్లె, బోడెమ్మనూరు గ్రామాల్లో సిసి రోడ్లు, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్‌లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల వద్దకు పాలన అందించేందుకే ప్రభుత్వ భవనాలను నిర్మించామన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల నాయకులు బుడ్డా చంద్రమోహన్ రెడ్డి, మాజీ సర్పంచి పోచ రాధాకృష్ణారెడ్డి, జడ్పిటిసి పుణ్య లక్ష్మీదేవి, శివరామ కృష్ణారెడ్డి, గజ్జల కృష్ణారెడ్డి, మార్తల పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుచ్చకాయలపల్లిలో సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ, ఎంపి, ఎమ్మెల్యేలు

ఘనంగా అచ్చెన్నాయుడు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి కేకు కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు మరెన్నో పుట్టినరోజులు జరుపుకుంటూ, ఉన్నత పదవులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు యువత నంద్యాల జిల్లా అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, ఎస్‌టి సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, పాతపాడు సర్పంచి విడుదల మహేశ్వరరెడ్డి, పట్టణ ఉప సర్పంచి బురానుద్దీన్, టిడిపి నాయకులు అన్వర్ సాహెబ్, టిప్ టాప్ కలాం, అల్తాఫ్ హుస్సేన్, లాయర్ నాగేంద్ర రెడ్డి, ఎల్లయ్య, యాగంటి పల్లె మహేశ్వర్ రెడ్డి, అహమ్మద్ హుస్సేన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

డోన్ : టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజంపు అచ్చెన్నాయుడు పుట్టిన రోజు సందర్భంగా డోన్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు అధ్యక్షతన డోన్ నియోజకవర్గ అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మాజీ ఎంపీపీ ఆర్.ఈ.రాఘవేంద్ర, నాయకులతో కలసి కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, సలహాదారుల కమిటీ నియోజకవర్గ అధ్యక్షులు మురళీకృష్ణ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి విజయ్ భట్, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ప్రజావైద్యశాల మల్లిఖార్జున, ప్యాపిలి మండల అధ్యక్షులు గండికోట రామసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి మెట్టుపల్లె సుదర్శన్, డోన్ నియోజకవర్గ యువ నాయకులు ధర్మవరం గౌతమ్ రెడ్డి, మైనారిటీ కమిటీ ప్రధాన కార్యదర్శి ఖాజా పీరా, న ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు రాముడు, డోన్ మండల ప్రధాన కార్యదర్శి ఎల్ఐసి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే

డోన్‌లో కేకును కట్ చేస్తున్న టిడిపి నాయకులు